క్లుప్తంగా

మొక్కలు పెంచాలి



ఏలేశ్వరంలో మొక్కలు నాటుతున్న కమిషనర్, సమితి సభ్యులు

ఏలేశ్వరం: పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే మొక్కలను ప్రతి ఒక్కరూ విధిగా పెంచాలని మున్సిపల్ కమిషనర్ ఎం.సత్యనారాయణ అన్నారు. ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని నర్సీపట్నం రోడ్డులో మంగళవారం మొక్కలు నాటారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ, మొక్కల పెంపకంతో వాతావరణ సమతుల్యత ఉంటుందన్నారు. వాతావరణ పరిరక్షణలో అవి కీలక పాత్ర పోషిస్తాయన్నారు. వాటిని పెంచడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఎస్.విజయబాబు, ఉపాధ్యక్షుడు అనసూరి నాగేశ్వరరావు, గోళ్ల నాగేశ్వరరావు, కర్రోతు సత్యనారాయణ, రౌతు సహదేవుడు, కోరాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటుకు చంద్రబాబు అంబాసిడర్



కేఓ మల్లవరంలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తుని రూరల్: ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వెన్నుపోటు పొడవడంలో సీఎం చంద్రబాబు నాయుడు అంబాసిడర్ అని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డొంక వెంకట బెనర్జీ అన్నారు. మంగళవారం కేఓ మల్లవరంలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమంలో ఇంటింటా పర్యటించి కూటమి ప్రభుత్వ మోసాలను గ్రామస్తులకు వివరించారు. సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు అన్నంరెడ్డి వీర్రాఘవులు, మాజీ సర్పంచ్ ఏకా కన్నయ్య, యువత అధ్యక్షుడు లోకవరపు అప్పలనాయుడు, మండల కార్యదర్శి అంకంరెడ్డి దొరబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి చింతల వెంకటరమణ, నాయకులు చిటికెల వరహాలబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీలింగ్ భూమిని పేదలకు ఇవ్వాలి

గండేపల్లి: మండలంలోని జెడ్ రాగంపేట సర్వే నంబర్–204లో ఉన్న 8ఎకరాల సీలింగ్ భూమిని నీలాద్రిరావుపేటలోని పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని ఏపీ రైతు కూలీ సంఘం ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నీలాద్రిరావుపేటలో ఏపీ రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సొంత ఇల్లు లేక ఎంతో మంది ఇబ్బందులు పడుతున్నారని, ఇల్లులేని వారికి నిరుపయోగంగా ఉన్న 8 ఎకరాల సీలింగ్ భూమిని పేదలకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సతీష్, రాజబాబు, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ప్రత్తిపాడు: మండలంలోని వెంకటనగరం పంచాయతీ శివారు తోటపల్లి గిరిజన తండాలోని సారా స్థావరాలపై ప్రత్తిపాడు ఎక్సైజ్ సిబ్బంది మంగళవారం దాడులు చేశారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారైన తోటపల్లికి చెందిన నాగరాజుపై కేసు నమోదు చేశారు. దాడుల్లో స్థానిక ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

గోకవరం: మండలంలోని మల్లవరంలో మంగళవారం ఎమ్మెల్యే నెహ్రూ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల దగ్గరికి వెళ్లగా సమస్యలు ఏకరవు పెట్టాయి. గ్రామంలో పశువుల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, విద్యుత్ సమస్య పరిష్కరించాలని, డ్రైనేజీలు నిర్మించాలని ప్రజలు కోరారు.

జాగృతి టీం సభ్యుడిగా పెద్దిరాజు



గోకవరం: నేషనల్ లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జస్టిస్ అవేర్నెస్ ఫర్ గ్రాస్ రూట్స్ ఇన్ఫర్మేషన్ ట్రాన్స్పరెన్సీ ఇనిషియేటివ్ (జాగృతి) టీం సభ్యుడిగా మండలంలోని గుమ్మళ్లదొడ్డికి చెందిన న్యాయవాది కండెల్ల పెద్దిరాజు ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారి నుంచి ఉత్తర్వులు అందుకున్నట్టు ఆయన మంగళవారం తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీల్లో లీగల్ డెస్క్‌లు ఏర్పాటు చేసి అందరికీ న్యాయం అందేలా చూడటం జాగృతి టీం ముఖ్య ఉద్దేశమన్నారు.

పందిరి సాగు.. లాభాలు బాగు

- పందిరి కూరగాయల సాగుతో లాభాలు అధికం
- ఆశాజనకంగా ధర
- ఆసక్తి చూపుతున్న రైతులు



కొలిమేరులో పందిళ్లపై దొండపాదుల సాగు



పాదుల నుంచి దొండకాయలు సేకరిస్తున్న రైతులు



సీతారాంపురంలో పాదుల నుంచి బీరకాయలు సేకరిస్తున్న మహిళ

తుని రూరల్: ఖరీఫ్ సీజన్‌లో అధిక శాతం రైతులు వరి సాగు చేస్తుండటంతో కూరగాయల సాగు, ఉత్పత్తి తగ్గింది. దీంతో పందిరి కూరగాయలకు డిమాండ్ పెరిగింది. పందిరి కూరగాయల సాగు రైతులకు లాభాలను అందిస్తుంది. ప్రధానంగా పందిర్లపైకి పాకించే దొండ, కాకర, ఆకాకర, బీర, సొరకాయ, పొట్లకాయలు, దేశవాళి చిక్కుడుకాయలు తదితర కూరగాయలు పది కిలోలు రూ.250 నుంచి రూ.600 వరకు ఉండటంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది. ఇందులో ప్రధానంగా దొండ పాదులు దీర్ఘకాల పంటకావడం, ఎగుమతులకు అనువుగా ఉండటం, శుభకార్యాల్లో ఎక్కువ వినియోగించడం, ఆరుతడిగా సాగవడంతో రైతులకు పందిరి కూరగాలయ సాగుపై ఆసక్తి పెరగుతుంది. పందిళ్లకు రూ.లక్షలు పెట్టుబడి అవుతున్నా సాగుకు వెనుకాడట్లేదు. గిట్టుబాటు ధరలు బాగుండటంతో రైతులతోపాటు, విక్రయిస్తున్న వ్యాపారులకు సైతం లాభాల పంట పండుతుంది. తాత్కాలిక, శాశ్వత పందిళ్లు వేసుకునేందుకు ఉద్యానశాఖ అధికారులు రైతులకు ప్రోత్సహకాలు అందిస్తున్నారు.

వంద ఎకరాలకుపైగా సాగు

ఉద్యానశాఖ తుని సబ్ డివిజన్‌లో తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాలు ఉన్నాయి. అన్ని మండలాల్లోనూ దొండకాయలు, బీరకాయలు, సొరకాయలు, చేదు కాకరకాయలు, దేశవాళి చిక్కుడుకాయలు పండిస్తుండగా.. తుని మండలం ఆటికెవానిపాలెంలో ఆకాకర కాయలను పందిళ్లపై పండిస్తున్నారు. ఈ పంట సాధారణంగా గిరిజన ప్రాంతాల్లో పండుతుండగా.. ఆటికెవానిపాలెంలో భూములు, వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఇక్కడ రైతులు ఎంతో సులభంగా ఆకాకరను పండిస్తున్నారు. తుని మండలంలో కొలిమేరు, సుభద్రయమ్మపేట, ఎస్.సూరవరం, తాళ్లూరు, మరువాడ, నందివంపు తదితర గ్రామాల్లో ప్రధానంగా పందిళ్లపై పాదులను ఎక్కించి దొండ సాగు చేస్తున్నారు. ఇదే విధంగా కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో వంద ఎకరాలకుపైగా భూముల్లో దొండ, బీర, కాకర, ఆకాకర, పొట్లకాయలను పండిస్తున్నారు.

రైతు బజారులో విక్రయం

ఇతర ప్రాంతాలకు ఎగుమతుల అవకాశం ఉండటంతో పండించిన పందిరి కూరగాయలను రైతులు తునిలోని రైతు బజారుకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. ఇక్కడ వ్యాపారులు ఖమ్మం, విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ తదితర మార్కెట్లకు ఎగమతి చేస్తున్నారు.

తుని రైతు బజారులో గిట్టుబాటు ధరలు

కూరగాయల రకాలు	గిట్టుబాటు ధర పది కిలోలు	వినియోగదారుల ధర కిలో
దొండకాయలు	రూ.250– రూ.300	రూ.40
బీరకాయలు	రూ.300– రూ.350	రూ.50
కాకర	రూ.300 –రూ.350	రూ.60
ఆకాకర	రూ.550 – రూ.600	రూ.80
దేశవాళి చిక్కుడు	రూ.600 –రూ.650	రూ.80

ఏడాది మొత్తం ఆదాయం

రెండు ఎకరాల విస్తీర్ణంలో పందిళ్లు వేసి దొండకాయలు పండిస్తున్నాను. ఏడాది మొత్తం ఆదాయం లభిస్తుంది. వారానికి ఒకసారి దొండకాయలు కోసి రైతు బజారులో విక్రయిస్తున్నాను. రబీ సీజన్ కంటే ఖరీఫ్ సీజన్‌లో అధికంగా గిట్టుబాటు ధర లభిస్తుంది. ఖరీఫ్‌లో కూరగాయల ఉత్పత్తి తక్కువగా ఉండటంతో దొండకాయలకు డిమాండ్ పెరుగుతుంది. పెట్టుబడి, కోత కూలి, రవాణా చార్జీలు తదితర ఖర్చులు పోను లాభం వస్తుంది.

– ఎస్.చినఅప్పారావు, రైతు, కొలిమేరు.

కూరగాయల సాగుకు రాయితీలు

పందిరి కూరగాయల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. కూరగాయల సాగుకు విత్తనాల కొనుగోలు, ఎరువులకు రాయితీలు అందిస్తున్నాం. పందిళ్లపై సాగు చేసే రైతులకు పందిళ్లు వేసుకునేందుకు రాయితీలు ఇస్తున్నాం. ఆసక్తి ఉన్న రైతులు విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలి. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు బిల్లులు జత చేస్తే నగదు బ్యాంకు ఖాతాల్లో జమవుతాయి.

– ఎస్.సుజాత, ఉద్యాన అధికారి, తుని.

జగన్‌ను కలిసిన మురళీకృష్ణంరాజు



ప్రత్తిపాడు రూరల్: తాడేపల్లి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఘనంగా నాగపంచమి వేడుకలు

ఏలేశ్వరం: శ్రావణమాసం పురస్కరించుకుని పట్టణంలో మంగళవారం నాగపంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ మండల కార్యదర్శి కటకం కిరిటీ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ వీధిలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగపంచమి సందర్భంగా హనుమాన్ చాలీసా, సుబ్రమణ్య శతనామావళి పఠించారు. కిరిటీ మాట్లాడుతూ, ఆగస్టు 16న కృష్ణాష్టమి వేడుకలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో దుర్గావాహిని, మాతృశక్తి సంఘాల సభ్యులు గిరిజ, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- జగన్ నామస్మరణ విడిచి అభివృద్ధిపై దృష్టి సారించండి
- సూపర్ సిక్స్ అమలు ఎప్పుడు?
- వైఎస్సార్ సీపీ హయాంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట



సమావేశంలో మాట్లాడుతున్న అల్లు రాజబాబు

గండేపల్లి, జగ్గంపేట: ఎవరి పాలనలో బీసీ హాస్టల్స్ అభివృద్ధి చెందాయో, ఎవరి హయాంలో హాస్టల్ విద్యార్థులకు శుచి, రుచికరమైన భోజనం అందిందో చర్చించేందుకు సిద్ధమా అని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు అల్లు రాజబాబు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను ప్రశ్నించారు. మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అధ్యక్షతన జగ్గంపేట పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హాస్టల్స్ విద్యార్థులకు పోషకాహారాన్ని అందజేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గోరుముద్ద పేరిట 16 రకాలతో రోజుకో మెనూ చొప్పున నాణ్యమైన భోజనం అందజేసినట్టు గుర్తుచేశారు. విద్యార్థుల అభిప్రాయాలతో వంటలు మార్చుచేసి వారంలో ఐదు రోజులు ఉడికించిన కోడిగుడ్డు, మూడు రోజుల పాటు రాగి జావ, చిక్కీ అందజేశామన్నారు.

గోరుముద్దకు రూ.7,245 కోట్లు ఖర్చుచేశామని, గత టీడీపీ హయాంలో (2014 నుంచి 2019 వరకు) సాంబారు అన్నంతో విద్యార్థులు కడుపు నింపుకున్నారన్నారు. మాజీ మంత్రి తోట నరసింహం మాట్లాడుతూ, ఏ విషయం జరిగిన గత పాలకులదే తప్పు అంటూ నెపం మోపడం కూటమి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. ఏడాది పాలనలో రాష్ట్రానికి, ప్రజలకు ఎటువంటి అభివృద్ధి అందజేశారో గుర్తుచేసుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ బోధన, విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు విద్యనందించామన్నారు. జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు ఒమ్మి రఘురాం మాట్లాడుతూ, జగన్ నామస్మరణ విడిచి అభివృద్ధిపై దృష్టిసారించాలని, చదువు ఒక్కటే మార్పు తీసుకొస్తుందనే సంకల్పంతో ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్యాబోధన అందజేసేందుకు కృషిచేసినట్టు పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌ను ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీ తోట రాంజీ, నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు రాపేటి శ్రీను, పార్టీ మండల అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, మండల ఉపాధ్యక్షుడు గణపతి, సెక్రటరీ రఘు, శ్రీను, నియోజకవర్గం శ్రామిక అధ్యక్షుడు గుర్రం మహాలక్ష్మి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ముద్రగడ ఆరోగ్యం కోసం పూజలు



ఆంజనేయ స్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల పూజలు

ప్రత్తిపాడు: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో ఆసుపత్రి నుంచి రావాలని స్థానిక అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ఆ పార్టీ శ్రేణులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం ఆధ్వర్యంలో స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి, పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ చిలకమర్తి వెంకటరమణ, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధి సలాది కృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఏడిద రెడ్డినాయుడు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ కోసం గిరిజన మహిళల పూజలు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యంగా ఉండాలని మండలంలోని తోటపల్లి దార మల్లికార్జున స్వామి ఆలయంలో గిరిజన మహిళలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఖరీఫ్ పనులు

కోటనందూరు: మండల వ్యాప్తంగా ఖరీఫ్ వరిసాగు పనులు ప్రారంభమయ్యాయి. అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురిసిన ఓ మోస్తరు వర్షం, ఆగస్టు 15లోగా తాండవ నీటిని విడుదల చేస్తారన్న ప్రకటనలతో రైతులు దమ్ములు చేస్తున్నారు. నారు అందుబాటులో ఉన్న రైతులు నాట్లు వేస్తున్నారు. చెరువులు, కాలువలు నీటితో కళకళలాడుతున్నాయి. తాండవ జలాశయంలో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. మండలంలో 17 పంచాయతీల పరిధిలో ఈ ఏడాది 10 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తారనే అంచానాలుండగా.. బోర్లు, నీటి సదుపాయం ఉన్న రైతులు ఇప్పటికే నాట్లు వేస్తున్నారు. కాగా, నాలుగు రోజులుగా ఎండ వేసవిని తలపించేలా కాస్తుంది. మరో నాలుగు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే పొలాలకు సాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేఈ చిన్నయ్యపాలెం, పాతకొట్టాం, కొత్తకొట్టాం, భీమవరపుకోట, ఎస్సార్‌పేట గ్రామాల్లో ఇప్పటికే నారు మడులకు నీటి ఎద్దడి తలెత్తింది. వరుణుడు కరుణించాలని అన్నదాతలు కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పించండి



శైలజకు వినతిపత్రం ఇస్తున్న పోరాట సమితి ప్రతినిధులు

తుని రూరల్: లోవకొత్తూరులో ఉన్న సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలిన డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ శైలజాను మాదిగ రిజర్వేషన్, రక్షణ పోరాట సమితి ప్రతినిధులు కోరారు. మంగళవారం వసతి గృహానికి వచ్చిన ఆమెను కలసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. తాగునీరు, విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్నారని, ప్రహరీగోడ లేకపోవడంతో విష సర్పాలు సంచరిస్తాయన్న భయంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. వ్యవసాయ విద్యుత్‌ను సరఫరా చేస్తుండటంతో తరుచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. ప్రత్యేకంగా ట్రాన్స్‌ఫార్మర్ వేసి విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునేందుకు వసతులు కల్పించాలన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ముప్పిడి శ్యామ్‌కుమార్, మీడియా కో–ఆర్డినేటర్ తుమ్మలపల్లి కుమార్, మాదిగ రక్షణ పోరాట సమిగి వ్యవస్థాపకుడు ఆరుగుల మోషే, కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఆరుగుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవనానికి ప్రహరీ నిర్మించాలి

గండేపల్లి: గ్రామంలోని పీహెచ్‌సీ భవనానికి ప్రహరీని నిర్మించాలని వైద్యాధికారి నరేష్ స్థానిక నేతలకు వివరించినట్టు తెలిపారు. మంగళవారం హస్పిటల్ పరిశీలనకు వచ్చిన వారితో ఆయన మాట్లాడారు. భవనం చుట్టూ తుప్పలు పెరగడం వల్ల పాములు సంచరించే అవకాశం ఉందని, వర్షం కురిసినప్పుడు మార్గం అధ్వానంగా ఉండటంతో వైద్యం నిమిత్తం వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవనం ఆరుబయట రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు గ్రామస్తుల ద్వారా తెలిసిందని, తక్షణమే ప్రహరీ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

పంటల బీమాతో రైతులకు లాభం

శంఖవరం: ప్రతి రైతు పంట బీమా నమోదు చేసుకోవడంతో లాభం చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మంగళవారం మండలంలోని అన్నవరం, మండపం గ్రామాల్లో పొలంబడి కార్యక్రమంలో భాగంగా బీమా ప్రాధాన్యత గురించి రైతులకు అవగాహన కల్పించారు. వరిసాగు చేస్తున్న రైతులు పంట బీమా పథకంలో భాగంగా ఎకరాకు రూ.760 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పంట నష్టం వాటిల్లితే ప్రభుత్వం బీమా ద్వారా రైతులను ఆదుకుంటుందన్నారు. వరిసాగు చేస్తున్న రైతులు గట్లపై కంది పంటను సాగు చేసుకోవాలన్నారు. అనంతరం వరి నారుమడులను పరిశీలించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

కిర్లంపూడి: వరి నారుమడి, నాట్లు వేసే విధానంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏఓ సుధా మాధురి తెలిపారు. మండలంలోని సోమవరం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నాట్లు వేసేటప్పుడు మొనలు తుంచి నాటుకోవాలని రైతులకు సూచించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, కౌలు కార్డుల ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. స్థానిక సీజీజీ బ్యాంక్‌ను సందర్శించి కౌలు రైతులకు ఇన్సూరెన్స్ ఎన్రోల్మెంట్ గురించి బ్యాంక్ అధికారులను అడిగినట్లు చెప్పారు. అనంతరం రైతులకు గట్లపై వేసుకోవడానికి కంది విత్తనాలు పంపిణీ చేశారు.

మల్లేపల్లిలో 'పొలం పిలుస్తోంది'

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లిలో ఏడీఏ జి.శ్రీనివాస్ ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ శ్రీరామ్ అధ్యక్షతన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు, ప్రతి రైతు క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో విచారణ

గోకవరం: శస్త్ర చికిత్స విఫలమైందని సోమవారం పీజీఆర్ఎస్‌లో జేసీ చిన్నరాముడుకు అందిన ఫిర్యాదుతో ఆయన దర్యాప్తునకు ఆదేశించారు. మంగళవారం గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో అనపర్తి ప్రభుత్వాస్పత్రి డాక్టర్ పద్మశ్రీ ఆధ్వర్యంలో వైద్య బృందం విచారణ నిర్వహించారు. శస్త్ర చికిత్సలు చేయించుకున్న పలువురి వద్ద నుంచి వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వారు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రత్తిపాడు: మండలంలోని ఒమ్మంగి గ్రామంలోని పేకాట శిబిరంపై మంగళవారం రాత్రి ప్రత్తిపాడు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు జూదరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.10,760 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా దంత శుభ్రత, దంత ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

ప్రత్తిపాడు: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 11 మందిపై కేసులు నమోదు చేసినట్టు సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. నిందితులను మంగళవారం స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఇద్దరు నిందితులకు జైలు శిక్ష, తొమ్మిది మందికి రూ.90 వేలు జరిమానా విధించారు. అన్నవరం, ఏలేశ్వరం, ప్రత్తిపాడు స్టేషన్ల పరిధిలో అరెస్టు చేసిన తొమ్మిది మందికి న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.90 వేలు జరిమానా విధించారన్నారు.

మానవ అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్

గోకవరం: ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మంగళవారం చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మహిళలకు ప్రయాణ సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. హెల్ప్ లైన్ నంబర్లు 139, 1098, 100 ఉపయోగం, ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం సుచరిత మార్గరేట్, చైల్డ్ రైట్స్ ప్రతినిధి కరిబండి రాజు పాల్గొన్నారు.

ల్యాప్‌ట్యాప్ అప్పగింత



బాధితుడికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న జీఆర్పీ ఎస్సై

తుని: రైలులో పోగొట్టుకున్న ల్యాప్‌ట్యాప్‌ను బాధితుడికి అప్పగించినట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. ఓ వ్యక్తి సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఎక్కి అనకాపల్లి నుంచి తునికి ప్రయాణిస్తూ ల్యాప్‌ట్యాప్ మరచిపోయి వెళ్లిపోయాడు. బ్యాగ్ కోసం స్టేషన్‌కు రాగా రైలు వెళ్లిపోయింది. దీంతో జీఆర్పీ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై సిబ్బందికి చెప్పారు. వారు బ్యాగ్‌ను వెతికి బాధితుడికి అందజేశారు.

రక్షణ కల్పించండి

ప్రత్తిపాడు: మండలంలోని ఇ.గోకవరంలో తనకు రక్షణ కల్పించాలని బాధిత రైతు వినోద్ కుమార్ రెడ్డి పొలంలో మంగళవారం రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ, గ్రామంలో 2016లో కుచుమంచి ఉమామహేశ్వరరావు వద్ద 10 ఎకరాల పొలాన్ని కొనుగోలు చేసి ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. తన భూమికి సంబంధించి క్రయ దస్తావేజు, అడంగల్, హైకోర్టు ఆర్డర్లు ఉన్నాయన్నారు. అయినప్పటికీ ఆ భూమికి ఎలాంటి సంబంధం లేని చింతాకుల భాస్కరరావు, ధర్మాజీ నిత్యం పంటను ధ్వంసం చేసి నష్టాన్ని కలిగిస్తున్నారని పేర్కొన్నారు. పోలీస్ రక్షణ కల్పించమని హైకోర్టు ఆదేశించినా.. ప్రత్తిపాడు పోలీసులు పట్టించుకోకపోవడంతో తనను చంపేందుకు దాడులకు తెగబడుతున్నారన్నారు. ఇప్పటికీ తన పంటను 12 సార్లు ధ్వంసం చేశారని చెప్పారు. దాడి చేసిన ప్రతిసారి ఎస్సై లక్ష్మీకాంతం కేసు నమోదు చేస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవట్లేదన్నారు. ఇప్పటికైనా ఎస్సై తన ప్రాణాలకు రక్షణ కల్పించి, పంట మరోసారి ధ్వంసం చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

కృష్ణవర్మకు సత్కారం

కిర్లంపూడి: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దాట్ల కృష్ణవర్మ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మండలాధ్యక్షుడు రాజబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను ఘనంగా సత్కరించారు.

తడి, పొడి చెత్త సేకరణపై సూచనలు

తొండంగి: మండలంలోని ఏ.కొత్తపల్లిలో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు మంగళవారం పరిశీలించారు. శానిటరీ సిబ్బందితో తడిచెత్త, పొడి చెత్త సేకరణపై మాట్లాడారు. అనంతరం కేంద్రం నిర్వహణపై పంచాయతీ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రాము తదితరులు ఉన్నారు.

రోడ్డు సదుపాయం కల్పించండి

రౌతులపూడి: మండలంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన జల్దాం శివారు గిన్నిలారంలోని ప్రజలు రవాణా సాగించేందుకు రోడ్డు సదుపాయం కల్పించాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు. జల్దాంకు సుమారు ఐదు కిలోమీటర్లు కొండకోనల్లోంచి ప్రయాణం సాగించాల్సి ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పండిన పంటలను విక్రయించాలన్నా, నిత్యావసరాలు కొనుగోలు చేసుకోవాలన్నా, గర్భిణులు ఆసుపత్రికి వెళ్లాలన్నా రోడ్డు సదుపాయం లేక కాలిబాటలోనే ప్రయాణించాలని వాపోతున్నారు. తమ గ్రామానికి కనీసం కాలిబాటనైనా బాగుచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకున్నా ఎలాంటి ఫలితం దక్కలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన రహదారి సదుపాయం కల్పించాలని కోరుతున్నారు.

విజిలెన్స్ విచారణ

ప్రత్తిపాడు: ఆడుదాం ఆంధ్రా నిధుల వినియోగంపై ప్రత్తిపాడులో విజిలెన్స్ అధికారులు మంగళవారం సాయంత్రం విచారణ చేపట్టారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విజిలెన్స్ సీఐ శ్రీనివాసరెడ్డి ఆడుదాం– ఆంధ్రా నిధుల విడుదల, వినియోగం తదితర అంశాలను పరిశీలించారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలతో పాటు ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో ఆడుదాం– ఆంధ్రా నిర్వహణకు గత ప్రభుత్వం రూ.1.76 లక్షలు విడుదల చేసింది. దీని బిల్లులు, ఖర్చులు తదితర రికార్డులను విజిలెన్సు అధికారులు తనిఖీ చేశారు.

బంగారు రూపుల పంపిణీ

గోకవరం: మహిళల్లో హైందవ చైతన్యం తీసుకురావాలనే సంకల్పంతో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు చేపట్టిన బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమం మంగళవారం రెండో రోజు కొనసాగింది. మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహిళలకు డ్రా తీసి లక్కీ డ్రాలో గెలుపొందిన 230 మందికి అర గ్రాము బంగారు రూపులను పంపిణీ చేశారు. స్థానిక సూర్య ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు శ్రీనివాసరావు, పద్మావతిదేవి దంపతులు రూపులను, పసుపు, కుంకుమ పంపిణీ చేశారు.

వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

జగ్గంపేట: బలవంతం, అక్రమ నిర్బంధ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.రఘునాథరావు తెలిపారు. జగ్గంపేటకు చెందిన ఈశ్వరరావు రాజమండ్రి వెళ్లే రోడ్డులో షాపు నిర్మించుకుంటుండగా అదే గ్రామానికి చెందిన ఆకుల సోమశేఖర్ విలేకరునని చెప్పి ఇబ్బందులకు గురిచేసినట్టు పేర్కొన్నారు. అతడిని రూ.50 వేలు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేయడంతో రూ.10 వేలు ఇచ్చారు. ఇంకా ఇవ్వాలని ఇబ్బంది పెట్టడంతో ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు సోమశేఖర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు.